క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా రాణించాలి

కొందుర్గు: మహిళలు ఆర్థికంగా రాణించాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్ అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పద్మారం గ్రామంలో పీఎంఎఫ్‌ఎంఈ పథకం ద్వారా మంజూరైన పిండి గిర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30శాతం సబ్సిడీతో రూ.2లక్షలు మంజూరయ్యాయన్నారు. రూ.60వేల రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఎం నర్సింహులు, మాజీ సర్పంచ్ లక్ష్మిసుధ, మాజీ ఎంపీటీసీలు మానయ్య, రాములు, మహిళా సమాఖ్య అధ్యక్షుడు మంజుల, కార్యదర్శి లక్ష్మి, సీసీలు దేవయ్య, రమేశ్, వీఓఏ యాదయ్య పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాత మహిపాల్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని హాజిపల్లి రోడ్డు విజయనగర్ కాలనీలోగల వీరాంజనేయ సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి సోమవారం పట్టణానికి చెందిన గౌని శేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గౌని మహిపాల్‌రెడ్డి రూ.1.50లక్షల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం మహిపాల్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు బాలగోపాల్, శంకర్‌రెడ్డి, ఎలికట్ట శేరివెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలను అభివృద్ధి చేసుకుందాం

కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శోభ

మొయినాబాద్‌రూరల్: దేవాలయాలను అభివృద్ధి చేసుకునేందుకు అందరూ కృషి చేయాలని కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శోభ, మాజీ ఎంపీటీసీ అర్చన పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ ఆలయ నిర్మాణానికి కేతిరెడ్డిపల్లి, అనుబంధ గ్రామమైన చాకలిగూడ గౌడ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు రేనెట్ల సంగమయ్య రూ.1.01లక్షలను విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడ్ల వెంకటయ్య, నాయకులు గోడుగు యాదయ్య, మోత్కుపల్లి కృష్ణారెడ్డి, కారోబార్ కృష్ణారెడ్డి, రేనెట్ల సంగమయ్యగౌడ్, పెంటయ్యగౌడ్, దర్శన్‌గౌడ్, శివలింగంగౌడ్, శేఖర్‌గౌడ్, రాజుగౌడ్, అశోక్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, సత్తయ్యగౌడ్, నర్సింహులుగౌడ్, అంజయ్యగౌడ్, ధనుంజయ్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో వెలిసిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, అంజయ్యయాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు మహోత్సవానికి వచ్చిన అతిథులకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, అగ్గనూరి విశ్వం, రాఘవేందర్‌గౌడ్, రాయికల్ శ్రీనివాస్, రాజుగౌడ్, బసప్ప, రవిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, లక్ష్మణ్ నాయక్, చందునాయక్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలో నిర్మిస్తున్న నూతన హనుమాన్ దేవాలయ నిర్మాణానికి సోమవారం మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి కలిసి 1లక్ష రూపాయలు, గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు విఘ్నేశ్‌గౌడ్ 50 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజు, సత్తయ్యగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగలు.. యమపాశాలు

- తక్కువ ఎత్తులో వేలాడుతున్న వైర్లు
- ఇప్పటికే పలువురి మృతి
- పట్టించుకోని సంబంధిత అధికారులు



జాతీయ రహదారి పక్కన తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగల కింద నిలిపిన లారీలు(ఫైల్)

కొత్తూరు: ఇంటిపైన బట్టలను ఎండబెడుతూ ఒకరు.. సరదాగా బాల్కనీలో నిలబడిన మరొకరు.. లారీపైకి ఎక్కి టార్పాలిన్‌ను సరిచేస్తూ ఇంకొకరు ఇలా తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా విద్యుదాఘాతానికి గురై కొత్తూరు మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో పలువురు మృతి చెందారు. అప్పటివరకు తమతో ఉండి ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందుతుండడంతో మృతుల కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ఇళ్లపై నుంచి వెళ్లిన తీగలు.. రోడ్డు సమీపంలో తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న సంబంధిత శాఖల అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు మాత్రమే హడావిడిగా సంఘటన స్థలానికి రావడం .. ప్రమాదాలకు గల కారణాలను తెలుసుకోవడం చేస్తున్నారే తప్పా మరోమారు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

తక్కువ ఎత్తులో ఉండడమే కారణం..

జాతీయ రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. కాగా మార్గమధ్యలో డ్రైవర్లు కాలకృత్యాలు తీర్చుకోవడానికి, విశ్రాంతి కోసం, టార్పాలిన్‌ను కట్టేందుకు రోడ్డు పక్కన వాహనాలను నిలుపుతుంటారు. కాగాపైన తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలను గమనించకుండా వీరు వాహనాల పైకి ఎక్కి విద్యుదాఘాతానికి గురైన సంఘటనలు జాతీయ రహదారిపై తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఇళ్లపైన బట్టలను ఆరవేసే క్రమంలో.. ఇంటి బాల్కనీలో నిలబడిన సమయాల్లో ఇళ్లకు కొద్ది దూరంలో నుంచి ఉన్న విద్యుత్ తీగల కారణంగా పలువురు విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందారు.

మండలంలో ప్రమాదాలు..

- వెంకటేశ్వర హెచరీస్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన గత నాలుగేళ్ల క్రితం ఎంఆర్ఎఫ్ టైర్లతో వెళ్తున్న భారీ కంటేయినర్ విద్యుదాఘాతానికి గురై టైర్లు, వాహనం కాలిపోయాయి. దీనికి కారణం డ్రైవర్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపే క్రమంలో పైన విద్యుత్‌తీగలను గమనించలేదు. అదృష్టవశాత్తు డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.
- తిమ్మాపూర్ హెచ్‌ఐఎల్ పరిశ్రమ ఎదురుగా ఓ లారీ క్లీనర్ లారీపైన టార్పాలిన్ కడుతుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- తిమ్మాపూర్ చౌరస్తా కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న బాలుడు ఇంటిపైకి వెళ్లి ఆడుకుంటుండగా సమీపంలోని విద్యుత్ తీగల కారణంగా ప్రమాదానికి గురయ్యాడు. అదృష్టవశాత్తు బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు.
- పారిశ్రామికవాడలో పత్తి విక్రయానికి వచ్చిన లారీని డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలను గమనించలేదు. దీంతో పత్తికి మంటలు అంటుకోవడంతో డ్రైవర్ లారీని జనావాసాలకు దూరంగా తీసుకెళ్లి నిలిపాడు. వెంటనే స్థానికులు స్పందించి మంటలు అంటుకున్న పత్తిని లారీలో నుంచి తొలిగించారు.
- తిమ్మాపూర్ చౌరస్తా కాలనీలో ఐదేళ్ల క్రితం ఇంటర్ చదువుతున్న హర్షిత(17) ఇంటి బాల్కనీలో నిలబడగా సమీపంలోని విద్యుత్ తీగల కారణంగా మంటలు అంటుకున్నాయి. తీవ్రంగా గాయపడిన ఆమే ఐదురోజుల పాటు చికిత్స పొందిమృతి చెందింది.
- 5వ వార్డులోని ఓ ఇంటి పై అంతస్తులో మురుగు నీటి పైపులైన్‌ను సరిచేసే క్రమంలో గత మూడేళ్ల క్రితం ఇనుప రాడ్ బయట ఉన్న విద్యుత్ తీగలకు తాకడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఒకరు మృతి చెందారు.



కొత్తూరులో ఇళ్ల మధ్యలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

మండలం, మున్సిపాలిటీలో కనెక్షన్లు ఇలా..	
డొమెస్టిక్	10,500
కమర్షియల్	4,000
ఇండస్ట్రియల్	450
అగ్రికల్చర్	2,300
స్ట్రీట్‌లైట్స్	365

కనీస చర్యలు కరువు..

ఇళ్లపై, సమీపంలో నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు, తక్కువ ఎత్తులో ఉన్న వాటి గురించి తరచూ ప్రజలు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. అయినప్పటికీ వారు స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏదో తమ వంతుగా రక్షణ చర్యల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారే తప్పా క్షేత్రస్థాయిలో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

దరఖాస్తుదారులే ఖర్చులు భరించాలి



ఇళ్లపై నుంచి వేలాడుతున్న విద్యుత్ తీగలు, ప్రమాదకరంగా మారిన స్తంభాలను మార్చడానికి విద్యుత్‌శాఖ ఎలాంటి నిధులు మంజూరు చేయడం లేదు. ఒకవేళ మార్చాలని ప్రజలు దరఖాస్తు చేసుకుంటే సాధ్యాసాధ్యాలను బట్టి దరఖాస్తుదారులే ఖర్చులు భరించాల్సి వస్తుంది. మున్సిపాలిటీలో తీగలను మార్చడానికి స్థానిక ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ ట్రాన్స్‌కో అధికారులతో చర్చించారు.

– రమేశ్‌గౌడ్, ట్రాన్స్‌కో ఏఈ

ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో ఉన్న వీరశైవ ఆగమ వేద పాఠశాలలో విద్యార్థులకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దగ్గు, జ్వరం, జలుబు వంటివి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. సీజనల్‌గా వస్తున్న వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 105 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ ముస్తాక్ అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ రమ, అశోక్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూముల పరిశీలన



అజీజ్‌నగర్‌లో గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రకళ, అధికారులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం రైతు భరోసా పరిశీలన చివరిరోజు కావడంతో అజీజ్‌నగర్ గ్రామాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్ రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏఈఓ సురేష్‌బాబు, మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్, వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అహ్మద్, ఆర్ఐ సుజిత్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు సునిల్, కుమార్, రెవెన్యూ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే నంబర్ల వారీగా..

మొయినాబాద్: సాగు యోగ్యమైన భూముల క్షేత్రస్థాయి పరిశీలన సోమవారం కొనసాగింది. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ, చిన్నషాపూర్ గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పర్యటించారు. సర్వే నెంబర్ల వారీగా పరిశీలించి లేఅవుట్లు, ప్లాట్లు, ఫాంహౌస్‌లు, క్రీడా మైదానాలు, వ్యవసాయేతర కార్యకలాపాలు నిర్వహిస్తున్న భూములను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఐదురోజుల పాటు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టామన్నారు. సాగుయోగ్యమైన భూములు, సాగుయోగ్యం కాని భూములను గుర్తించామన్నారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు మండలంలో గ్రామసభలు జరుగుతాయని, అందులో లబ్ధిదారుల వివరాలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ఆర్ఐలు సుజిత్‌రెడ్డి, రోజ, ఏఈఓలు కుమార్, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల విలీనంపై ఆలోచించాలంటూ ఫిర్యాదు

చేవెళ్ల: చేవెళ్ల మున్సిపాలిటీలో కలిపే విలీన గ్రామాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని చేవెళ్ల బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో చేవెళ్ల మున్సిపాలిటీ విలీన గ్రామాలకు సంబంధించి గెజిట్‌లో చేవెళ్లకు చేరువలో ఉన్న కొన్ని గ్రామాలు విలీనంలో లేనట్లుగా ఉందని చెప్పారు. చేవెళ్ల మున్సిపాలిటీని ఒక భౌగోళిక స్వరూపంతో చేయాల్సి ఉంటుందనే నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. చేవెళ్లకు సరిహద్దు గ్రామాలను కలిపి చేస్తేనే మున్సిపాలిటీకి ఒక రూపం ఏర్పడుతుందన్నారు. పరిపాలన సౌలభ్యంగా ఉంటుందన్నారు. గతంలో 12 గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా చేస్తున్నట్లు ప్రకటించిన ఇప్పుడు ఎనిమిది గ్రామాలతోనే మున్సిపాలిటీగా మారుస్తున్నారన్నారు. చేవెళ్లకు సమీపంలో ఉన్న కందవాడ, మల్లారెడ్డిగూడ, పలుగుట్ట, పామెన గ్రామాలను వదిలేయడం సరికాదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

ఊరేళ్ల పంచాయతీని మున్సిపాలిటీలో కలపొద్దు

చేవెళ్ల మున్సిపాలిటీలో ఊరేళ్ల గ్రామాన్ని కలపొద్దని గ్రామస్తులు, పలువురు నాయకులు అధికారులకు విన్నవిస్తున్నారు. ఊరేళ్ల గ్రామం మున్సిపాలిటీలో కలుపుతున్నారనే సమాచారంతో సోమవారం గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. మా గ్రామం చేవెళ్లకు దూరంగా ఎలాంటి సరిహద్దులేని గ్రామంగా ఉందన్నారు. చేవెళ్లకు ఆనుకొని సరిహద్దులు కలిసి ఉన్న కందవాడ, మల్లారెడ్డిగూడ, పామెన లాంటి గ్రామాలను వదిలివేసి ఎలాంటి సంబంధం లేని దూరంగా ఉన్న తమ గ్రామాన్ని కలపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇది కావాలనే కొందరూ రాజకీయం చేస్తూ రాజకీయ ఒత్తిడిలకు లోనై విలీనం చేయటం సరైనది కాదన్నారు. ప్రభుత్వ పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి మరోసారి మున్సిపాలిటీలో విలీన గ్రామాలపై పరిశీలించాలని కోరుతున్నారు.

రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలి

- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన నాయకులు, రైతులు



షాబాద్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

షాబాద్: రుణాలు మాఫీ కానీ రైతులకు వెంటనే మాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జడల రాజేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన రుణమాఫీ కాని రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీఎం డౌన్.. డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వం రైతుల రుణాలు మాఫీ చేయాలని, రైతుభరోసా అందించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షాబాద్‌లో కేటీఆర్ రైతు ధర్నా జరిగిన ప్రదేశాన్ని కాంగ్రెస్ నాయకులు నీళ్లు, కల్లాపి చల్లి శుద్ధి చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. అంబేడ్కర్ అందరివాడని, ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసనలు తెలపడానికి అందరికీ స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. కుమ్మరిగూడ గ్రామానికి చెందిన జనమ్మకు రుణమాఫీ కాలేదని, ఆమె రైతు ధర్నాలో కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చిందని, దీనిపై కాంగ్రెస్ నాయకులు ఏదేదో మాట్లాడటం సరికాదన్నారు. వాళ్ల కొడుకుల పేరుపై భూమి చేశారని, వాళ్లకు బ్యాంకుల్లో రుణమాఫీ అయ్యిందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని చెప్పారు. జనమ్మ కొడుకులకు అసలు బ్యాంకులో ఖాతా కూడా లేదనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గ్రహించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలు ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ రైతుధర్నా ప్రదేశాన్ని శుద్ధి చేయడం కాదని, వాళ్ల మనస్సులను ఫినాయిల్‌తో కడుక్కోవాలని సూచించారు. అలాంటి చిల్లర చేష్టలు మానుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పోనమోని కేత న, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహులు, చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంటీపీసీ మండలి సత్యం, నాయకులు రమేష్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి, మల్లేశ్, వెంకట్‌రెడ్డి, ముఖ్రంఖాన్, రాంచందర్, రాజేశ్వర్‌రెడ్డి, యాదిరెడ్డి, పురుషోత్తంచారీ, అవిలాశ్‌గౌడ్, యాదయ్య, మహిళా రైతులు చెన్నమ్మ, స్వరూప, పార్టీ శ్రేణులు, తదితరులున్నారు.

31న మహా పాదయాత్ర

కొందుర్గు: శ్రీశైల క్షేత్రానికి ఈ నెల 31న శివస్వాముల మహా పాదయాత్ర ఉంటుందని గురుస్వామి భూపాలచారి తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల శివరామాజంనేయస్వామి దేవాలయంలో శివస్వాములతో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పెద్ద ఎల్కిచర్ల నుంచి బయలుదేరనున్న ఈ పాదయాత్రకు ఇప్పటికీ 300 మంది శివస్వాములు పేర్లు నమోదు చేశారని, ఇంకా ఎవరైనా పేర్లు నమోదు చేయాలనుకుంటే, నమోదు చేయించాలని సూచించారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

ఆర్డీఓ చంద్రకళ



ఆర్డీఓ చంద్రకళకు ఫిర్యాదు అందిస్తున్న ధర్మసాగర్ గ్రామస్తులు

చేవెళ్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నామని, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్డీఓ చంద్రకళ తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజావాణిలో మొత్తం ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇందులో షాబాద్ మండలానికి సంబంధించి మూడు రెవెన్యూ ఫిర్యాదులు, మొయినాబాద్ నుంచి రెవిన్యూకు సంబంధించి ఒక్కటి రైతు బంధు ఇవ్వాలని ఫిర్యాదు వచ్చిందన్నారు. చేవెళ్ల మండలానికి సంబంధించి ధర్మసాగర్ గ్రామస్తులు ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్లు కేటాయించాలని కోరుతూ గ్రామ నాయకులు, గ్రామస్తులతో వచ్చి ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులన్నింటినీ సంబంధిత అధికారులకు పంపించి వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మొయినాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దూరమవుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాకారం గ్రామంలో హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో యువకులతో కలిసి ఆయన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రతకు అందరూ సహకరించాలని కోరారు. గ్రామంలో రోడ్లపై చెత్త వేయొద్దన్నారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

- ఐదురోజుల పాటు కొనసాగిన క్షేత్రస్థాయి సర్వే
- ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే గ్రామసభలలో అభ్యంతరాల స్వీకరణ



కేశంపేట: ప్రత్యేక అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ



చేవెళ్లలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ, పక్కనే ఎంపీడీఓ, తహసీల్దార్

కేశంపేట: మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో మూడురోజుల పాటు గ్రామసభలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసభలపై ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ గ్రామసభలు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో కొనసాగుతాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీఓ కిష్టయ్య, ఎంఈఓ చంద్రశేఖర్, ఏఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ దరఖాస్తును స్వీకరించాలి

శంకర్‌పల్లి: కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికకు సంబంధించి నేటి నుంచి ఈ నెల 24 వరకు మూడు రోజుల పాటు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకయ్య తెలిపారు. సోమవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సభల్లో ప్రజలు ఇచ్చే ప్రతీ దరఖాస్తును స్వీకరించాలని, తర్వాత ప్రభుత్వం సూచించిన సమయంలో వెరిఫికేషన్ చేయాలన్నారు. సిబ్బంది ఎక్కడ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దని, అలాంటి వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు.

పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి

చేవెళ్ల: ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పథకాలు ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అర్హుల జాబితా ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ హిమబిందు ఆధ్వర్యంలో మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రభుత్వ పథకాల పరిశీలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ గ్రామసభల నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు అందించిన గైడ్‌లైన్స్‌ను వివరించారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు రెండురోజుల్లో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణయ్య, మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్, మండలంలోని ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ చేరవేయాలి

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా సోమవారం మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హుల జాబితాను గ్రామసభలలో ప్రచురితం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామసభల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఏఓ రాజేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మూడు విడతలుగా..

మొయినాబాద్‌రూరల్: నేటి నుంచి గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నామని మండల అభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో మూడు విడతలుగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని గ్రామాల్లో ఎవరైనా రేషన్‌కార్డులకు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోనివారు ఉంటే గ్రామ సభల్లో చేసుకోవచ్చని తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్, చిత్రంలో మేనేజర్ అంజన్‌కుమార్

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కొత్త రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నిజమైన అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు ఖచ్చితంగా అందుతాయని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నేటి నుంచి నిర్వహించే వార్డు సభల గూర్చి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఎంపిక చేసిన వార్డులలో ఈ నెల 21 నుంచి 24 వరకు మూడు రోజులపాటు వార్డు సభలు జరుగుతాయని, ఆ సమయంలో వార్డులకు వచ్చిన అధికారులకు తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ప్రతీ వార్డులో సభలు ఉంటాయన్నారు. ప్రజలెవరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, వార్డుసభల్లో దరఖాస్తులు సమర్పించలేకపోయినా వారు, గడువు లోపు మున్సిపాలిటీలో ఇవ్వాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.